‘వర్గీకరణ బిల్లుతో అన్యాయం’

రవీంద్రభారతి: అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లుతో నేతకాని సమాజానికి తీరని అన్యాయం జరిగిందని, మాల,మాదిగల తరువాత అత్యధిక జనాభాగా 3వ స్థానంలో ఉన్న లక్షా ముప్పై మూడు వేల మంది నేతకాని సమాజాన్ని విస్మరించి తమ కంటే తక్కువ జనాభా లక్షా పదివేలు ఉన్న బుడిగ జంగాలకు ఒక్క శాతం రిజర్వేషన్లు ఏర్పాటు చేసి.. ఏ గ్రూప్‌లో కలిపి నేతకాని సమాజాన్ని అవమాన పరిచారని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుర్గుం రాజేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, వర్గీకరణ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కమిషన్ షమీమ్ అక్తర్‌ను స్వయంగా కలిసి నేతకాని సమాజాన్ని ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినా.. ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.

24 వరకు గడువు

సిటీబ్యూరో: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, యూనివర్సిటీ, ఇంజినీరింగ్, నర్సింగ్ తదితర ఇతర కాలేజీల యజమాన్యాలు 24 లోపు విద్యార్థుల ఫ్రెష్, రెన్యువల్ స్కాలర్‌షిప్ అప్లికేషన్ ఫామ్స్ (హార్డ్ కాపీస్) ను అందజేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జీ ఆశన్న ఒక ప్రకటనలో తెలిపారు. 2017-18 నుంచి 2024-25 వరకు ఉన్న పెండింగ్ అప్లికేషన్ల (హార్డ్ కాపీస్) లను అందజేయాలని సూచించారు.

ఫికస్ గార్డెన్ పరిశీలన

సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ రోడ్ నం. 51లోని ఫికస్ గార్డెన్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, యూబీడీ విభాగం అడిషనల్ కమిషనర్ సుభద్ర దేవి, శానిటేషన్ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతిలతో కలిసి గార్డెన్‌ను పరిశీలించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో: ఇండియన్ ఆర్మీలో చేరేందుకు ఔత్సాహిక అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మేజర్ పీసీ రాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు నంబర్‌లో 040-27740205 ను సంప్రదించవచ్చని సూచించారు.

పదోన్నతి పొందిన అధికారులకు సన్మానం

సిటీబ్యూరో: సర్వే ల్యాండ్ రికార్డ్స్ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ప్రసన్న లక్ష్మి, ఉమామహేశ్వరరావుకు జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతి రావడంతో కార్యాలయ సిబ్బంది వారిని ఘనంగా సన్మానించారు. జిల్లా సర్వే రికార్డ్స్ అధికారి వీ శ్రీరామ్, టీజీఓ ప్రెసిడెంట్ కృష్ణ యాదవ్, సిబ్బందితో కలిసి శుక్రవారం వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఏప్రిల్ 7న గిరిజన సంక్షేమ భవన్ ముట్టడి

హిమాయత్‌నగర్: రాష్ట్ర వ్యాప్తంగా బకాయి ఉన్న రూ.219 కోట్ల ట్రైకార్ రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 7న గిరిజన సంక్షేమ భవన్ ముట్టడికి లబ్ధిదారులు అధిక సంఖ్యలో తరలిరావాలని గిరిజన సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. రాజీవ్ యువ వికాసం పథకం పేరుతో ట్రైకార్ రుణాలు రద్దు చేసే కుట్ర అనే అంశంపై శుక్రవారం హిమాయత్ నగర్ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. జేఏసీ నేతలు ఆర్.అంజయ్య నాయక్, ఎం.ధర్మ నాయక్, రాంమూర్తి నాయక్, ఆర్.శ్రీ రామ్ నాయక్, దాస్ రాం నాయక్, రాంబాల్ నాయక్, భూక్యా సంజీవ్ నాయక్ తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలోని ట్రైకార్ సంస్థను నిర్వీర్యం చేసేందుకే ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకంలో ఈ సంస్థను విలీనం చేసిందన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

సిటీబ్యూరో: విజయనగర్ కాలనీలోని సెయింట్ అన్నాస్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 74,058 మందికి 73,695 మంది పరీక్ష రాయగా, 362 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

గొంతు తడవాలంటే పొదుపు చేయాల్సిందే..!

ముదురుతున్న ఎండలు.. అడుగంటుతున్న భూగర్భ జలాలు

ఉచిత మంచినీటి పథకాన్ని కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. నేడు ప్రపంచ నీటి దినోత్సవం

సిటీబ్యూరో, మార్చి21, (నమస్తే తెలంగాణ):

ఇది యంత్రాంగం వైఫల్యం...

- హైదరాబాద్ మహా నగరంలో జలమండలి రోజుకు సుమారు 560 మిలియన్ గ్యాలన్ల నీటిని తీసుకువస్తున్న జలమండలి చివరి వినియోగదారుడి వరకు ఆ జలాలను అందిస్తున్నదా? ఏమో... సాధారణంగా ఉండే సరఫరా నష్టం (స ప్లయి లాస్) 7-10 శాతం తీసివేస్తే మరో 20-25 శాతం వరకు నీటి పరిమాణం అసలు లెక్కల్లోకి రావడంలేదనేది (అన్ అకౌంటబుల్ వాటర్) ఓ అంచనా. ఇందులో నీటి చౌర్యమెంత? వృథాగా పోయేది ఇంకెంత??

ఇది సామాన్యుడి నిర్లక్ష్యం...

- హైదరాబాద్ మహా నగరంలో జలమండలి వివిధ నీటి వనరుల ద్వారా సేకరించి సరఫరా చేస్తున్న మంచినీటి కోసం కిలో లీటరుకు (వెయ్యి లీటర్లు) సరాసరిన రూ.30-40 వరకు ఖర్చు చేస్తుందని అంచనా. మరి ఇంత విలువైన జలాలు సామాన్యుడి గొంతు తడపాలి. కానీ రోజూ నగరవాసులు వృథా చేస్తున్న నీటి పరిమాణం ఎంతో తెలుసా?! ఆ పరిమాణంతో ఒక వరంగల్ పట్టణంగానీ కరీంనగర్ పట్టణంగానీ నీటి అవసరాలను తీర్చవచ్చని నిపుణులు చెబుతున్నారు.
- అసలే ఎండలు మండి నానాటికీ భూగర్భజలాలు అడుగంటుతున్న ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమూ తోడై నదీజలాలు సైతం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. అందుకే నేడు ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నగరవాసులు నీటి వృథాపై స్వీయ నియంత్రణగా ప్రతిజ్ఞ తీసుకుని పొదుపు పాటిస్తేనే రానున్న 2-3 నెలల కీలక సమయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా గొంతు తడుపుతుంది.
- ఒకనాడు చెంతనున్న జంట జలాశయాల నుంచి తాగునీటిని అందుకునే హైదరాబాద్ మహా నగరానికి ఇప్పుడు మంజీరా, కృష్ణా, గోదావరిజలాలను తరలిస్తున్నా దాహార్తిని పూర్తిగా తీర్చలేని పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలో అనేక బృహత్తర లక్ష్యాలను అధికారులు కాగితాలపైనే కాకుండా క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేస్తే సమస్య తీవ్రతను చాలావరకు తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.
- కాంక్రీట్ జంగిల్‌లా మారిన హైదరాబాద్‌లో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పక్కాగా అమలు చేయాలనే లక్ష్యం సమస్యలు తెరపైకి వచ్చినపుడే తప్ప మిగిలిన సమయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనిని వంద శాతం అమలు చేస్తేనే భావి తరాలకు భూగర్భజలాలు అందుతాయి.
- వివిధ వనరుల ద్వారా నీటిని తరలిస్తున్న జల మండలి ప్రస్తుతం ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో నీటి వృథా, చౌర్యాన్ని దాదాపు పూర్తిస్థాయిలో అరికట్టే అవకాశాలు ఉన్నాయి. కానీ దశాబ్దాలుగా ఇంకా 30-40 శాతం అన్ అకౌంటబుల్ వాటర్ ఉండటం బోర్డు నిర్వహణలో వైఫల్యానికి నిదర్శనం. ఫలితంగా డిమాండుకు సరిపడా సరఫరా కనిపించక కొత్త మంచినీటి పథకాలకు వేల కోట్ల రూపాయలను వెచ్చించాల్సి వస్తున్నది. వీటి కోసం ప్రభుత్వాల ఒత్తిడి మేరకు సంస్థలు వినియోగదారుల ముక్కుపిండి లోటును పూడ్చుకునే ప్రయత్నం చేస్తున్నాయి. అందుకే ఇప్పటికైనా దీనిని 15 శాతం లోపునకు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉంది.
- సామాన్యుడికి ఉచితంగా తాగునీటిని పొందడమనేది హక్కు. అందుకే కేసీఆర్ ప్రభుత్వం నగరంలోని ఎనిమిది లక్షల మందికి పైగా నిరుపేద కుటుంబాలకు 20వేల లీటర్ల వరకు ఉచిత తాగునీటి పథకాన్ని అమలు చేసింది. కానీ ఇప్పుడు ఆ పథకానికి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడుస్తున్నది. ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయడంలేదనే సాకుతో క్షేత్రస్థాయిలో ఆయా కుటుంబాల నుంచి నీటి బిల్లులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అందుకే నీటి వృథాను అరికట్టడం ఎంత ప్రధానమో... సామాన్యుడి హక్కును కాపాడటానికి సైతం జలమండలి అంతటి ప్రాధాన్యం ఇవ్వాలి.

నిమ్స్‌లో ఏడాదికి 3,500 వెన్నెముక ఆపరేషన్లు

- డైరెక్టర్ నగరి బీరప్ప
- వైద్యశాలలో స్పెషల్ ఎండోస్కోపి సర్జరీ సిస్టం ఏర్పాటు

ఎండోస్కోపి సర్జరీ సిస్టం విభాగాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

ఖైరతాబాద్: రోటరీ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్, రోటరీ సనైజ్ సర్వీస్ ట్రస్ట్ సహకారంతో నిమ్స్ అత్యాధునిక స్పెషల్ ఎండోస్కోపి సర్జరీ సిస్టం విభాగాన్ని ఎమర్జెన్సీ బ్లాక్‌లో మూడో అంతస్తులో ఏర్పాటు చేశారు. ఈ సాంకేతికతను బీహెచ్ఎల్-జీఈ గ్యాస్ టర్బైన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అందించగా, శుక్రవారం నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, రోటరీ జిల్లా గవర్నర్ కె. శరత్ చౌదరి, రోటరీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డానియల్ సి. హిమెల్స్ పాచ్, బీహెచ్ఎల్-జీఈ జేఎండీ బల్లా రాజశ్రీతో కలిసి ప్రారంభించారు. డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ నిమ్స్‌లో ఏడాదికి 3,500 వెన్నెముక ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని, ఈ నూతన పరిజ్ఞానంతో తక్కువ కోతతో నాణ్యమైన శస్త్ర చికిత్స చేయవచ్చన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ దవాఖానలో సుమారు రూ.5లక్షల వరకు ఖర్చవుతుందని, ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఉచితంగా అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ న్యూరో సర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ వంశీ కృష్ణ, రోటరీ సీఎస్ఆర్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్ గుమిడెల్లి, అనిల్ గోయల్, సమీర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నాట్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం

నిమ్స్ దవాఖానలో బ్లడ్ స్క్రీనింగ్ సురక్షిత రక్తాన్ని అందించేందుకు గాను నాట్ (న్యూక్లియక్ యాసిడ్ ఆంప్లిఫికేషన్ టెక్నాలజీ)ని అందుబాటులోకి తీసుకొస్తామని డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప తెలిపారు. నిమ్స్ బ్లడ్ బ్యాంక్ అధ్వర్యంలో నాట్ పై జరిగిన అవగాహన సదస్సు బ్లడ్ సెంటర్ విభాగాధిపతి డాక్టర్ సుధీర్ కుమార్ అధ్యక్షతన జరిగింది. డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ ఒక మనిషికి రక్తాన్ని ఎక్కించేందుకు నాణ్యత ఎంతో అవసరమని, ఈ పరిజ్ఞానం ద్వారా ఆ సమస్య తీరిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్, ప్రొఫెసర్ శాంతి, డాక్టర్ మహేశ్ కుమార్, డాక్టర్ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎపిలెప్సీ మానిటరింగ్..

రోటరీ క్లబ్ మోయినాబాద్, ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో నిమ్స్ దవాఖానలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ పీడియాట్రిక్ న్యూరాలజీ అండ్ ఎపిలెప్సీ విభాగాన్ని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప ప్రారంభించారు. 4వేల చదరపు ఫీట్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ విభాగంలో ఆత్యాధునిక ఐసీయూ, హెచ్ఏఏ, అడ్వాన్స్‌డ్ ఎపిలెప్సీ మానిటరింగ్ యూనిట్, పాలిస్కోనోగ్రఫీ, స్టీరియో ఈఈజీ తదితర పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ విధానంలో ప్రైవేట్, కార్పొరేట్ దవాఖానలో రూ.10లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు వస్తుందని, కానీ నిమ్స్ ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ లాంటి ప్రభుత్వ పథకాలతో పూర్తిగా ఉచితంగా అందిస్తామని డైరెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రీమియర్ ఎనర్జీస్ చైర్మన్ సురేందర్ పాల్ సింగ్, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్-3150 శరత్ చౌదరి, డాక్టర్ రాంప్రసాద్, ఏకేఎస్ ఉదయ్ పిలానీ, నిమ్స్ కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ అమరేశ్ రావు మలెంపాటి, న్యూరాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

కనీస అవసరాలు తీర్చరా...

బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి

హిమాయత్‌సాగర్‌లోకి వస్తున్న మురుగునీటిని చూపుతున్న కార్తిక్‌రెడ్డి

మణికొండ, మార్చి 21 : ‘ఖజానా కోసం ఈ ప్రాంతం కావాలా... కనీస అవసరాలు తీర్చడం మాత్రం ఈ సర్కారుకు అవసరం అవసరం లేదా’ అని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తిక్ రెడ్డి అన్నారు. శుక్రవారం హిమాయత్ సాగర్ జలాశయంలోకి ఏరులై పారుతున్న మురుగు నీటి కాలువలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ప్రాంతం నుంచి నిధులు కావాలి తప్ప.. ఇక్కడి ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పన మాత్రం ఏమాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. గత నెల రోజుల కిందట బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు హాజరై రిజర్వాయర్లను ప్రారంభించి, పక్కనే ఉన్న హిమాయత్ సాగర్ జలాశయం నుంచి బండ్లగూడ మున్సిపాలిటీ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చి వెళ్లారన్నారు. తాగునీటి ఎద్దడిని నివారించకపోగా.. కలుషితమైన నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. స్వచ్ఛమైన నీటితో కళకళలాడే జంట జలాశయాలను కాపాడాలంటే ముందుగా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగునీటి కాలువలకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ఆయన సూచించారు.

బస్తీ దవాఖానల్లో నర్సులే వైద్యులు

(మొదటిపేజీ తరువాయి)

రోగులు లక్షణాలు చెబితే వారికి ఉన్న అవగాహన మేరకు మందులు ఇచ్చి పంపిస్తున్నారు. దీంతో సరైన సమయంలో సరైన చికిత్స అందక రోగులు ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని బస్తీ దవాఖానల్లో నమూనాలు సేకరించేందుకు అవసరమైన సిబ్బంది లేక 55రకాల వైద్యపరీక్షలకు గాను పరిమితంగా అతి తక్కువ వైద్యపరీక్షలు చేస్తున్నారు. మరికొన్ని దవాఖానల్లో వైద్యపరీక్షల కోసం వచ్చే రోగులకు ఇతర కేంద్రాలకు లేదా ప్రైవేటు ల్యాబ్‌లకు పంపుతున్నట్లు రోగులు ఆరోపిస్తున్నారు.

మందులు.. పీహెచ్‌సీ కోటా తోనే సరిపెడుతున్నారు

గ్రేటర్ పరిధిలోని బస్తీ దవాఖానల్నీ స్థానికంగా ఉండే ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనిచేస్తున్నాయి. అయితే బస్తీ దవాఖానల కోసం ప్రత్యేకంగా మందులు కేటాయించడం లేదు. ఆయా క్లస్టర్ల పరిధిలో ఉన్న పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలకు మాత్రమే ప్రతి మూడు నెలలకు ఒకసారి మందులను మంజూరు చేస్తున్నారు. అయితే పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలకు కూడా రోజువారీ రోగులు వస్తూనే ఉంటారు. వాటి పరిధిలోకి అదనంగా బస్తీ దవాఖానలను ఏర్పాటు చేయడంతో ఇచ్చే మందులు అటు పీహెచ్‌సీలు, ఇటు బస్తీ దవాఖానలకు సరిపోవడం లేదని సిబ్బంది వాపోతున్నారు. ప్రస్తుతం పిహెచ్‌సీలకు కేటాయించే మందుల్లోనే బస్తీ దవాఖానలకు కూడా పంపిణీ చేయాల్సి రావడంతో మందుల కొరత తలెత్తుతోందని సిబ్బంది చెబుతున్నారు. బస్తీ దవాఖానల కోసం అదనంగా మందులను మంజూరు చేస్తే సమస్య తీరుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని రోగులు కోరుతున్నారు.

సమస్యలు..

కొన్ని ఉదాహరణలు

అత్తాపూర్‌లోని పాండురంగనగర్ బస్తీ దవాఖానలో వారంలో ఒకరోజు మాత్రమే వైద్య పరీక్షలు చేస్తున్నారు. సరిపడా సిబ్బంది లేరు. ప్రభుత్వం అందిస్తున్న మందులు 15 రోజులకు మాత్రమే సరిపోతున్నాయి. దీంతో రోగులకు సిబ్బందికి మధ్య గొడవలు తప్పకారి

మూడునాలుగు రోజుల్లో వైద్యులను నియమిస్తాం

జిల్లా పరిధిలో మొత్తం 76 బస్తీ దవాఖానలు రోగులకు సేవలు అందిస్తున్నాయి. అయితే బస్తీ దవాఖానల్లో పనిచేస్తున్న వైద్యుల్లో కొంత మంది వైద్యులు పీజీ సీట్లు రావడం, ఇతర అవకాశాలు రావడంతో రాజీనామా చేసి వెళ్లిపోతున్నారు. దీంతో అక్కడక్కడ ఖాళీలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 11మంది వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా కలెక్టర్ నుంచి అనుమతి వచ్చిన వెంటనే రెండు మూడు రోజుల్లో వైద్యుల నియామకం పూర్తవుతుంది. రోగులకు ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నాం.

– డా.వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

24గంటల్లో వర్ష సూచన

సిటీబ్యూరో: ద్రోణి ప్రభావంతో రాగల 24 గంటల్లో గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా, పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి.

తక్షణమే బకాయిలు చెల్లించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీడీపీజీఎంఏ) రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. తమకు రావాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో వచ్చే నెలలో నిర్వహించబోయే డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను నిర్వహించబోమని హెచ్చరించింది. ఈ మేరకు ఓయూ అధికారులకు అసోసియేషన్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు.

ఎలివేటెడ్‌కు మా ఆస్తులివ్వం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పాడింది. అంతేకాక భూ సేకరణ ప్రక్రియపై ఇప్పటికే 325 అభ్యంతరాలు వచ్చిన విషయం విదితమే. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి సాంకేతిక సమస్యలు అధిగమించేది, పనులు ప్రారంభించేది ఎప్పుడన్నది ప్రశ్నార్థకంగా మారింది.

అప్పులు చేసి ..

గ్రామసభల పేరుతో టైమ్ పాస్ చేస్తున్నారు. పిల్లల భవిషత్తు కోసం అప్పులు చేసి ముందుకు వచ్చాము. తూంకుంట పట్టణంలో భవనం కడితే భవిష్యత్తు బాగుంటుందని .. బ్యాంకుల్లో అప్పులు చేసి కట్టాను. మేం ఇలా ఇల్లు కట్టుకోగానే .. ఇప్పుడు రోడ్డు విస్తరణ పేరుతో మా ఇల్లు లాగేసుకుంటున్నారు.

– మధుమోహన్ రెడ్డి, తూంకుంట

గుండెలు పగిలిపోతున్నాయి

దళిత కుటుంబాల్లో ఈ ప్రభుత్వం చిచ్చు పెట్టింది. రోడ్డు విస్తరణ ప్రచారం మొదలు ఇప్పటికే గుండె పగిలి తూంకుంటలో ముగ్గురు చనిపోయారు. ఇంకా ఎంతమంది ప్రాణాలు తీస్తారో తెలియడం లేదు. మేం 240 మంది దరఖాస్తు ఇచ్చాం. మేము అడిగిన ఏ ప్రశ్నకూ సమాధానం రాలేదు. వంద ఫీట్ల రోడ్డైతే అంగీకరిస్తాం. పుట్టిన ఊరినుండి తట్టా బుట్టా సర్దుకొమ్మని పొమ్మంటే సహించేది లేదు. 200 ఫీట్ల రోడ్డేస్తే భూమికి బదులుగా భూమి ఇవ్వండి

– సుభాష్‌గౌడ్, తూంకుంట.

భూమికి భూమే కావాలి



ఆ రోజుల్లో భూమి అమ్మి ఇక్కడ 180 గజాలు కొన్న. ఈ రోడ్డు పుణ్యమాని ఆ బిల్డింగ్ కు మార్కింగ్‌చేశారు. అది కూడా రోడ్డు కోసం ఇస్తే నా పరిస్థితి ఏంది? రోడ్డు విస్తరణకు మేము అడ్డం కాదు. కానీ మాకు భూమికి భూమి ఇవ్వాల్సిందే

– కాసుల రాజయ్య గౌడ్, తుంకుంట.

అప్పుల పాలయ్యాం

ఆరు నెలలుగా అప్పుల పాలయ్యం. నాకున్నది ఈ ఒక్క ప్లాటే రోడ్డుకు కట్టుకుని బాగుపడుతామని అనుకున్నాం కానీ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు విస్తరణ జరుగుతున్నదని ప్రచారం ప్రారంభమైనప్పటి నుంచి ఇండ్లు కిరాయికి పోక మాకు 3 లక్షల వరకు నష్టం వచ్చింది. అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఈ రోజు వరకు ఇంతమంది లీడర్లను కలిసినం. ఒక్కరు కూడ పట్టించుకోలేదు. ఉప్పల్ భగాయత్ లో నిర్వాసితులకు ఇచ్చినట్టే మాకు భూమికి బదులుగా భూమిని కేటాయించాల్సిందే.

– విద్యాసాగర్, తూంకుంట.

తెలంగాణలో నిర్వహించిన అంతర్జాతీయ అటవీ దినోత్సవంలో మిస్‌వరల్డ్ క్రిస్టినా పిస్కోవా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, అటవీశాఖ అధికారులతో నగరంలోని కేబీఆర్ పార్కులో మొక్కలు నాటి నీరుపోశారు.

– హైదరాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ):

దంత వైద్యం సున్నితమైంది

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

‘వైభవంగా ఆర్మీ డెంటల్ సైన్సెస్’ స్నాతకోత్సవం

స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

జవహర్‌నగర్, మార్చి 21: దంత వైద్యం సున్నితమైందని, నూతన టెక్నాలజీతో యువ డాక్టర్లు మెరుగైన వైద్యాన్ని అందించాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పిలుపునిచ్చారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ఆర్మీ డెంటల్ సైన్సెస్ కళాశాలలో శుక్రవారం వైభవంగా స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ చూపిన యువ దంతవైద్యులకు అవార్డులు, నగదు బహుమతులు అందజేశారు.

స్ప్రింగ్ సమ్మర్ ఫ్యాషన్ షో

సిటీబ్యూరో: హైదరాబాద్ నగరంలో హై-లైఫ్ ఎగ్జిబిషన్ ప్రత్యేక స్ప్రింగ్ సమ్మర్ ఫ్యాషన్ షోను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక ప్రదర్శన మార్చి 21, 22, 23 తేదీల్లో హైటెక్ సిటీలోని హెచ్‌ఐసీసీ-నోవోటెల్ హోటల్‌లో జరుగుతుందని, ఇందులో నూతన ట్రెండ్స్, గ్లామర్, లైఫ్‌స్టైల్, విలాసవంతమైన డిజైనర్ వేర్, బ్రైడల్ వేర్, క్రియేటివ్ ఫ్యాషన్ వేర్, ఆభరణాలు, యాక్సెసరీలు మొదలైన ఆకర్షణీయమైన ఉత్పత్తులను ప్రదర్శించనున్నారని వారు వెల్లడించారు.

జాతీయ అరిథమెటిక్ చాంపియన్‌గా రాకేశ్

సిటీ బ్యూరో: హైదరాబాద్‌కు చెందిన గ్రీషిన్ రాకేశ్ అరుదైన ఘనత సాధించాడు. ప్రపంచ వేగవంతమైన మానవ కాలిక్యులేటర్‌గా ఘనత వహించిన నీలకంఠ భాను ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ అరిథమెటిక్ చాంపియన్‌షిప్‌లో విజయం సాధించి ఔరా అనిపించుకున్నాడు. దేశంలోని 750 నగరాల నుంచి 6 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గన్న ఈవెంట్ ఫైనల్ రౌండ్‌లో150కి పైగా ప్రశ్నలకు సమాధానాలిచ్చి చాంపియన్‌గా నిలిచాడు.

అపరిశుభ్రంగా ఉన్న సుబ్బయ్య హోటల్ వంటగది

సుబ్బయ్య వంటగది చూడతరమా?

నిర్వాహకులకు ఫుడ్ సేఫ్టీ నోటీసులు

సిటీబ్యూరో, మార్చి 21 (నమస్తే తెలంగాణ) : మేడిపండు చూడు మేలిమై ఉండు..పొట్ట విప్పి చూడు పురుగులుండు అన్న చందాన నగరంలో పేరు ప్రఖ్యాతులు గాంచిన హోటళ్ల అపరిశుభ్ర రూపం నెమ్మదిగా బయటపడుతున్నది. టీవీల్లో, సోషల్ మీడియాలో రుచికరమైన సంప్రదాయబద్ధమైన భోజనం తయారు చేస్తామంటూ ఆడంబరంగా ప్రచారం చేసుకుంటున్న రెస్టారెంట్ల అసలు స్వరూపం బట్టబయలైతున్నది. ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారుల తనిఖీల్లో విస్తుపోయే విషయాలు తెలిసొస్తున్నాయి. ఈ మేరకు కొండాపూర్‌లో సుబ్బయ్యగారి హోటల్‌లో ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించారు. వంటగది ప్రాంతం చాలా అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. నేల, గోడలు జిడ్డుగా మరకలతో నిండి ఉన్నట్లు, ఆహార వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించలేదని, పని చేసే సిబ్బందికి హెడ్‌క్యాప్